
ఆంధ్రజ్యోతి

5 

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 24.0

ఆదివారం 2 నవంబరు 2025

గుప్త నిధులకోసం మరోసారి..!



ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో తవ్విన గుంత

6

పోలీసులకు తలనొప్పిగా మిస్సింగ్ కేసు

- బీచుపల్లి వద్ద నదిలో దూకి చనిపోతున్నట్లు యువకుడి వీడియో కాల్
- రెండు రోజులు గాలిస్తున్నా దొరకని ఆచూకీ
- దూకాడా.. లేదా? అనే అనుమానంలో పోలీసులు



బోటు సహాయంతో గాలిస్తున్న పోలీసులు

7

నిండా ముంచిన నకిలీ విత్తనాలు

- నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతు
- పెట్టిన పెట్టుబడి రాకపోయె..

7

లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా న్యాయాధికారి రమాకాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రమాకాంత్

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని సమాజానికి దూరం కావాల్సిన దుస్థితి ఏర్పడిందని జిల్లా న్యాయాధికారి రమాకాంత్ అన్నారు. జిల్లా కోర్టు న్యాయ సేవాధికారి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 15న స్పెషల్ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో కొంతమంది చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుని జైలు జీవితాలు గడుపుతూ సమాజానికి దూరమవుతున్నారని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇద్దరు వ్యక్తులు కూడా విజయం సాధించినట్టేనని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా చెక్‌బౌన్స్ కేసులు భూతగాదాలు చిన్నచిన్న తగాదాలకు సంబంధించిన కేసులన్నీ పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించడంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఐదో స్థానంలో నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికారి నసీంసుల్తానా మాట్లాడుతూ పొటెన్షన్ కేసులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటే కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. లోక్‌అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకుంటే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆమె అన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉన్నారు.

టెండరు వివాదంపై దర్యాప్తు



విచారణ చేస్తున్న అధికారులు

6

పత్తి రైతుల పరేషాన్

- పారదర్శకత కోసం తెచ్చిన యాప్‌తో పత్తి రైతులు అష్టకష్టాలు
- అవగాహన లేకపోవడం.. డేటా సరిపోలక పోవడమే సమస్య
- ఈ ఏడు రైతులను ముంచిన అధిక వర్షపాతం
- సీసీఐ కొనుగోళ్ల చిక్కులతో తక్కువ ధర ఇస్తున్న ప్రైవేటు వ్యాపారులు

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ కాకపోవడంతో అవస్థలు



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి

మహబూబ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధిక వర్షపాతం పంటను ఎదగనీయలేదు.. పూత నిలువక.. కాత కాయకపోవడంతో దిగుబడి తక్కువ వచ్చే పరిస్థితులు నెలకొన్నాయి.. ఇదే తరుణంలో తుపాను ప్రభావం, కూలీల కొరతతో వర్షాలకు చేలల్లో ఉన్న పత్తి అలాగే కారిపోయి, కింద పడింది. మొక్కపై ఉన్న కాయలు మురిగిపోయాయి. పత్తి ఇక దిగుబడి వచ్చే అవకాశం లేక, ఇప్పటికే చాలామంది రైతులు మొక్కలను తొలగించారు. ఇన్ని కష్టాలు ఓవైపు వెంటాడుతుండగానే సీసీఐ రూపంలో పత్తి రైతు నడ్డి విరిచినట్లుగా పరిస్థితి తయారైంది. ప్రభుత్వ వ్యవస్థలు ఏటా పారదర్శకత పేరుతో ఏదో ఒక కొత్త ప్రయోగం చేయడం.. దానివల్ల రైతు నష్టపోయి, దళారులు లాభపడటం సర్వసాధారణంగా మారింది.

ఈ ఏడాది కూడా పత్తి రైతుల విషయంలో అదే జరుగుతోంది. గత సంవత్సరం వ్యాపారులు రైతుల పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకుని వారి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి.. సీసీఐకి మద్దతు ధరకు విక్రయించి అవకతవకలకు పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించింది. సీసీఐ, మార్కెటింగ్ శాఖల్లో జరిగిన ఈ అవినీతిపై విజిలెన్స్ విచారణ కూడా చేసి నిర్ధారించుకుంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లలో అవకతవకలను నివారించడం, పారదర్శకత కోసం 'కపాస్ కిసాన్' యాప్‌ను తెచ్చింది. అధికారులు, మిల్లర్లకు సంబంధం లేకుండా రైతులే నేరుగా సదరు యాప్‌లో పత్తి విక్రయం కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే నల్లగా మారి, మొదటి దశలో వచ్చిన పత్తిని రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకే రైతులు దళారులకు విక్రయించి.. నష్టపోయారు. తర్వాత వచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర రూ.8,110కి అమ్మేందుకు ఎదురుచూశారు. సాధారణంగా అక్టోబరు మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి సెప్టెంబరులో టెండర్లు పూర్తవ్వాలి. కానీ ఈ యాప్ కారణంగానే టెండర్లు ఆలస్యంగా అయ్యి.. అక్టోబరు చివరివారంలో ప్రారంభమయ్యాయి.



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను

అవగాహన లేకపోవడంతోనే..

ఏదైనా కొత్త ప్రయోగం చేస్తున్నప్పుడు అది రైతులకు అర్థమవుతుందా? వారికి దానిపై అవగాహన ఉందా? లేదా అని తెలుసుకోవడం, వ్యవసాయ లేదా మార్కెటింగ్ అధికారులతో అవగాహన కల్పించడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది. కానీ కపాస్ కిసాన్ యాప్‌లో రైతులే నేరుగా స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పిన

(మిగతా 6లో..)

విద్యార్థులకు మెరుగైన వైద్యం

- బాధ్యులను సస్పెండ్ చేస్తాం : కలెక్టర్
- వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా



గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని ధర్మవరం బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులు అందరూ శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులు రావడంతో విద్యార్థులను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 55 మంది విద్యార్థులు ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం 33 మంది విద్యార్థులను శనివారం ఉదయం డిశ్చార్జి చేశారు. మిగిలిన 22 మంది విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని బట్టి డిశ్చార్జి చేయిస్తామన్నారు. మరోసారి ఇలాంటి ఘటన చోటుచేసుకోకుండా చూస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. వసతి గృహంలో మొత్తం 140 మంది విద్యార్థులకు గాను 110 మంది ఉన్నారని తెలిపారు. క్యాబేజీ, కాలిఫ్లవర్ కలిపి వండటంతో ఈ ఆహారం పడని 55 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. అంతే కాకుండా ఉడకబెట్టిన గుడ్డు తినడం కూడా కారణమని ఆరోపణలు వస్తుండటంతో శ్యాంపిల్స్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తామన్నారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులను సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

- పంచాయతీ కార్యదర్శిపై బాలిక కుటుంబ సభ్యుల దాడి

ఖిల్లాఘణపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని అడ్డుకోవడంతో, బాలిక కుటుంబ సభ్యులు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణపై దాడి చేశారు. గ్రామానికి చెందిన ఓ బాలికకు మరో గ్రామానికి చెందిన యువకుడితో గత నెల 30న వివాహం చేయాలని నిశ్చయించి, శుభలేఖలు కూడా పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు 28వ తేదీన గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను సఖి కేంద్రానికి తరలించారు. 31వ తేదీన తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చి, వివాహం చేయబోమని అంగీకార పత్రం రాయించుకొని బాలికను ఇంటికి పంపించారు. అయితే వివాహం ఆగిపోవడానికి పంచాయతీ కార్యదర్శే కారణమని భావించిన బాలిక, ఆమె తల్లి ఆశకార్యకర్త, కుమారుడు శనివారం పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, ఎంపీవో అక్కడికి చేరుకొని అతడికి సంఘీభావం తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న ఆమె కూతురుకు బాల్య వివాహం చేయడమేంటని డీఎంహెచ్‌వో ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఒక వర్గం ఒత్తిడి వల్లే...

గ్రామంలోని ఒక వర్గం వారి ఒత్తిడి మేరకే వివాహాన్ని అడ్డుకున్నారని బాలిక తల్లి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వివాహ విషయం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు ముందే తెలుసని అన్నారు. డాక్టర్ సర్టిఫికెట్, అంగన్వాడీ రికార్డుల ప్రకారం తన కుమార్తె వివాహ వయసు ఉందని వివరించారు. అయితే బాలిక ఎస్‌ఎస్‌సీ సర్టిఫికెట్‌లో పుట్టిన సంవత్సరం 2008గా ఉంది. కానీ అంగన్‌వాడీ రికార్డులు, ఆధార్‌కార్డు, డాక్టర్ సర్టిఫికెట్లలో 2006గా నమోదై ఉంది.

దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఫారం, 6,7,8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సహా పెండింగ్‌లో ఉన్న ఫారంలో పరిష్కారం అంశంపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్‌రెడ్డి వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. వనపర్తి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వీసీలో పాల్గొన్నారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లో భాగంగా 2025 ఓటర్ జాబితాను మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫారం. 6,7,8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వనపర్తి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

చలిలో చన్నీటి స్నానాలు

- వసతి గృహ విద్యార్థుల తీవ్ర అవస్థలు
- హీటర్లు లేక వేడి నీళ్లకు నోచుకోక అనారోగ్యంపాలు



వనపర్తి పట్టణంలోని అంజయ్యనగర్ ఎస్సీ వసతి గృహం వద్ద ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థి

6

భవిష్యత్తులో ప్రమాదాలు జరగొద్దు

- ఉమా మహేశ్వర క్షేత్రాన్ని పరిశీలించిన అధికారులు

అచ్చంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమామహేశ్వర క్షేత్రంలో కొండచరియలు విరిగిపడి ఆలయ పరిసరాలు దెబ్బతిన్నాయి. పాపనాశిని గుండం వద్ద కొండచరియలు నెర్రెలు పారాయి. శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ డీఈ వేమూరి శ్రీనివాస్ శర్మ, ఏఈ రణవీర్‌లతో పాటు ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాస రావులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని ప్రహరీ నిర్మాణానికి రూ.60 లక్షలు, ఫ్లోరింగ్ కోసం రూ.90 లక్షలు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. కార్తీక మాసం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాగంణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



ఉమామహేశ్వర ఆలయం వద్ద విరిగిపడిన కొండచరియలను పరిశీలిస్తున్న అధికారులు

తుఫాను నష్టం వివరాలు సేకరించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అధికారులు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన తుఫాను వలన జరిగిన నష్టం వివరాలను శాఖల వారీగా తక్షణమే సేకరించాలని అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో తుఫాను నష్టాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా అన్ని శాఖలకు సంబంధించిన నష్టాలపై ఆరా తీశారు. శాశ్వత పనుల కోసం అంచనాలను తయారు చేసి శనివారం సాయంత్రం నాటికి పంపాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఏ ఒక్కరికి నష్టం జరుగకుండా నష్టం వివరాలు ఖచ్చితంగా ప్రభుత్వం అందజేసిన ఫార్మాట్‌లో పంపించాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లతో నిర్వహించిన వీసీలో నష్టాల వివరాలు, సహాయక చర్యలపై వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, పశుసంవర్ధకశాఖ అధికారి జ్ఞానేశ్వర్, పంచాయతీరాజ్ ఈఈ, ఇరిగేషన్ ఈఈ ఉన్నారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

6

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ. 1.20 లక్షల నగదు స్వాధీనం
- విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించిన పట్టణ ఎస్‌ఐ

పత్తి రైతుల పరేషాన్

(5వ పేజీ తరువాయి)

అధికారులు దానిపై అవగాహన కల్పించడం మాత్రం మరిచిపోయారు. దీంతో చాలామంది రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోలేక.. ఎవరు కలిస్తే వారిని బతిమాలుతున్న పరిస్థితులు సీసీఐ కేంద్రాల వద్ద కనిపిస్తున్నాయి. అందులో ఏదైన సమస్య వస్తే అదేంటో తెలుసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వరుస వర్షాలు, తుఫాన్ ప్రభావంతో తేమశాతం సాధారణంగానే అధికంగా ఉంటుంది. వాతావరణ పరిస్థితులను పరిశీలనలోకి తీసుకుని సడలింపు ఇవ్వాల్సిన ప్రభుత్వం మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్రజా ప్రతినిధులు ఏదో తూతూ మంత్రంగా చెబుతున్నారే తప్ప.. తేమ 12 శాతం ఉంటేనే అన్‌లోడ్ చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభం కాగా.. ఇప్పుడు సెలవులతో రైతులు విక్రయించలేని పరిస్థితి ఉంది. అయితే ఈ సమయంలో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు ఇదే అదునుగా భావించి రూ. 5 వేల నుంచి రూ. 6 వేల లోపు మాత్రమే ధర పెడుతున్నారు.

సమాచారం సరిపోలక..

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలంటే రైతులు తమ పంట వివరాలను, ఆధార్ నంబరును అందులో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అయితే సీజన్ ప్రారంభ సమయంలో రైతులు ఏయే పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు అనే వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తారు. ఆ డేటాను ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఇప్పుడు కిసాన్ కపాస్ యాప్‌కు కూడా ఇదే డేటా ప్రామాణికం. కానీ వ్యవసాయ అధికారులు సరిగా పంటల నమోదు కార్యక్రమం చేపట్టకపోవడం, పంటలు సాగు చేసినా చేయనట్లుగా నమోదు చేశారు. దాంతో ఇప్పుడు కపాస్ కిసాన్ యాప్‌లో రైతు నంబర్ ఇచ్చి.. ఓటీపీ ఎంటర్ చేశాక, ఫార్మర్ నాట్ రిజిష్టర్డ్ అని.. ఫార్మర్ ఆల్‌రెడీ రిజిష్టర్డ్ విత్ బార్‌కోడ్ అని వస్తోంది. స్లాట్ బుక్ కావడం లేదు. పూర్తిగా యాప్ వినియోగంపై అవగాహన లేకపోవడంతో సీసీఐ అధికారుల వద్దకు వెళ్తే.. వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాలని చెబుతున్నారు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తే సీసీఐ అధికారుల వద్దకు వెళ్లాలని తిప్పి పంపుతున్నారు. తిరిగే ఓపిక లేనివారు ఎంతోకొంతకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతుండగా.. మరికొందరు రైతులు తెలిసిన వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులకు ఉపయోగం లేకపోగా.. కష్టాలు తీవ్రమవుతున్నాయి. సీసీఐ నేరుగా కొనుగోలు చేసినప్పుడు కంటే ఇప్పుడే చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైస్ మిల్లు తనిఖీ చేసిన జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్



పావని రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్

పెబ్బేరురూరల్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి సమీపంలో గల పావని రైసు మిల్లును జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ప్రభుత్వానికి సీఎంఆర్ ధాన్యం అందించకుండా రైసు మిల్లు నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. శనివారం పావలి ట్రేడర్స్‌ను సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ధాన్యం జోగులాంబ జిల్లాకు తరలిస్తున్నారని సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. రైస్ మిల్లుకు ప్రభుత్వం సీఎంఆర్ కోసం 2555 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 1712 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. 899 మెట్రిక్ టన్నులు ఇచ్చారని, ఇంకా 813 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందని డీఎస్‌వో చెప్పారు. 1214 మెట్రిక్ టన్నుల ద్వారా స్టాక్ ఉందని 260 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా ఉందని చెప్పారు. అదే విధంగా సకాలంలో ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ అందించకపోవడం వల్ల రావాల్సిన బకాయిలు సకాలంలో రావని ఆయన అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాకు సంబంధించిన ఆర్డర్ ఎలా ఇచ్చారో అన్ని వివరాలను జాయింట్ కలెక్టర్‌కు నివేదిస్తామని డీఎస్‌వో చెప్పారు.

అప్పాయిపల్లి గ్రామాన్ని సందర్శించిన పీయూ విద్యార్థులు



అప్పాయిపల్లి గ్రామంలో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు

లింగాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించే రూరల్ క్యాంపు నిర్వహణకు గాను శనివారం పాలమూరు యూనివర్సిటీకి చెందిన సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ మొదటి సంవత్సరం విద్యార్థులు గ్రామానికి చేరుకున్నారు. ప్రొఫెసర్లు గాలెన్న, చంద్రశేఖర్, బండి పర్వతాలు ఆధ్వర్యంలో 35మంది విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొంటారని ప్రొఫెసర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల జీవన విధానాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, మహిళాసంఘాల ప్రగతి, రైతులు ఎలాంటి పంటలను సాగు చేసుకుంటున్నారు, ధాన్యం ఎక్కడ విక్రయాలు జరుపుతున్నారనే అంశాలపై సమాచారం తెలుసుకోనున్నట్లు తెలిపారు. పాఠశాలల పనితీరు, గ్రామంలో పారిశుధ్య పనితీరు తదితర అంశాలను తెలుసుకోనున్నట్లు వారు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపు నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

టెండరు వివాదంపై దర్యాప్తు


ఈవో కార్యాలయంలో ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రామక్రిష్ణ రావు

అలంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో నెలకొన్న వివాదాలపై శనివారం దర్యాప్తు కొనసాగింది. కొన్ని రోజులుగా పత్రికల్లో, సోషల్ మీడియాలో వస్తున్న కూరగాయల షీల్డ్ టెండర్ల వివాదంపై దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రామక్రిష్ణరావు, డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి ఆలయ ఈవో కార్యాలయంలో ఫిర్యాదుదారులతో దర్యాప్తు చేపట్టారు. వాదోపవాదాలను ఉన్నతాధికారులకు నివేదించి.. తుది నివేదిక వెల్లడిస్తామని దేవస్థానం వారు తెలియజేశారు. ఇదిలా ఉండగా విచారణ అనే సందర్భంగా టెండరుదారులకు, ఫిర్యాదుదారులకు లోపల విచారణ జరుగుతుండగా, మాటామాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. దీంతో పోలీసులు వచ్చి సద్దుమణిగేలా చేశారు. ఈ క్రమంలోనే టెండరుదారులతో డీఎస్పీ మొగులయ్య పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఊర్కొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊర్కొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు పరమేష్ (21) అదే గ్రామానికి చెందిన బాలిక (16)పై లైంగికంగా వేధిస్తుండటంతో తల్లిదండ్రుల కు తెలిపిందని అన్నారు.

దీంతో బాలిక తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

చలిలో చన్నీటి స్నానాలు

- వసతి గృహ విద్యార్థుల తీవ్ర అవస్థలు
- వేడి నీళ్లకు నోచుకోక అనారోగ్యంపాలు

వనపర్తి విద్యావిభాగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో రోజు రోజుకు క్రమంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. ఉదయం వేళ నిద్ర లేవాలంటేనే జిల్లా ప్రజలు జంకుతున్నారు. దీనికి తోడు తుఫాన్ ప్రభావంతో నిత్యం వర్షాలు కురుస్తున్నాయి. అలాంటిది వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ఉదయం వేళ ఎముకలు కొరికే చలిలోనే చన్నీటి స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యాల పాలవుతున్నారు. వసతి గృహాల్లో పేద బలహీన వర్గాల విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటున్నారు. వసతి గృహ అధికారులు విద్యార్థులకు సోలార్ హీటర్లు లేదా గ్రీజర్లు సమకూర్చి వేడి నీటి సౌకర్యం కల్పించాలని మొర పెట్టుకున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

గతంలో కేజీబీవీలో..

గతంలో జిల్లాలోని 10 కేజీబీవీలలో (నూతన మండల కేజీబీవీలలో కాకుండా) ప్రభుత్వం లక్షలు వెచ్చించి సోలార్ హీటర్లను ఏర్పాటు చేసింది. అవి కొన్ని సంవత్సరాలు పని చేసి మొరాయించాయి. వాటి మరమ్మతులు చాలా ఖర్చుతో కూడుకున్నది కావడంతో నేటికీ మరమ్మతులు చేయించలేదు. సోలార్ హీటర్లు కాకుండా అతి తక్కువ ఖర్చుతో గ్రీజర్లను ఏర్పాటు చే స్తే విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనంతో పాటు ఖర్చు ఆదా అవుతోంది. అతి తక్కువ ఖర్చుతో అన్ని సంక్షేమ హాస్టళ్లలో, గురుకుల, కేజీబీవీలలో గ్రీజర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు వేడి నీరు అందేవిధంగా చొరవ తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


వనపర్తి జిల్లా కేంద్రంలోని అంజయ్య నగర్ ఎస్సీ వసతి గృహంలో ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో ఇదే పరిస్థితి

వనపర్తి జిల్లా వ్యాప్తంగా బీసీకి సంబంధించి ప్రీ మెట్రిక్ 10 వసతి గృహాలలో 973 మంది విద్యార్థులు ఉండగా, పోస్టుమెట్రిక్ 5 వసతి గృహాలలో 1029 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే, ఎస్సీలకు సంబంధించి ప్రీ మెట్రిక్ 17 వసతి గృహాలలో 1952 మంది విద్యార్థులు ఉంటుండగా, పోస్టుమెట్రిక్ 4 వసతి గృహాలలో 586 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే, ఎస్టీకి సంబంధించి ప్రీ మెట్రిక్ 2 వసతి గృహాలలో 155 మంది విద్యార్థులు ఉండగా, పోస్ట్‌మెట్రిక్ 2 వసతి గృహాలలో 295 మంది విద్యార్థులు, ఒకటి ఆశ్రమ వసతి గృహంలో 363 మంది విద్యార్థులు ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని వసతి గృహాలలో దా దాపు 5300 విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో చాలా వరకు వసతి గృహాలలో విద్యార్థులు ఆరు బయటనే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతి గృహాలలో కొన్ని ప్రభుత్వ భవనంలో ఉండగా, మరికొన్ని అద్దె భవనంలో ఉన్నాయి. విద్యార్థినుల వసతి గృహాలు ఎక్కువగా అద్దె భవనంలో ఉండడంతో అక్కడ తగిన సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వసతి గృహాలను పరిశీలించి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వేడి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం



నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. వసతి గృహం నుంచి కళాశాలకు నడిచి వెళ్లడానికి చాలా దూరం ఉంటుంది. సమయానికి కళాశాలకు చేరుకోవడానికి ఉదయాన్నే లేచి స్నానం చేయాల్సి ఉంటుంది. ఎముకలు కొరికే చలిలో చన్నీటితో స్నానం చేయాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. అనారోగ్యాల పాలవుతున్నాం. అధికారులు దృష్టి సారించి వేడి నీరు వచ్చే విధంగా కృషి చేయాలి.

\- ఛత్రపతి, విద్యార్థి, ఎస్సీ వసతి గృహం, అంజయ్య కాలనీ వనపర్తి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

జిల్లాలోని సంక్షే మ హాస్టల్లో విద్యార్థులు వేడి నీటితో స్నానం చేయడానికి ప్రస్తుతానికి సదుపాయాలు లేవు సోలార్ హీటర్లు లేదా గ్రీజర్లు ఏర్పాటు చేయడం ఖర్చుతో కూడుకున్నది. ఈ విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. తక్కువ ఖర్చుతో కూడుకున్న గ్రీజర్ల ఏర్పాటు చేయడానికి దాతలు ఎవరైనా ముందుకు వస్తే ఆహ్వానిస్తాం.

\- ముజాహిద్ ఖాన్, జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ. 1.20 లక్షల నగదు స్వాధీనం
- విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించిన పట్టణ ఎస్ఐ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకొని చేసిన అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచర్లుగా మారారు. ఆ ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకొని వారినుంచి రూ. 1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూల్ జిల్లా మద్దికెర గ్రామానికి చెందిన దూదేకుల షాహిద్‌వలి, కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన పింజరి దస్తగిరిలు ఇద్దరు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లు, కాసినోగేమ్స్‌కు అలవాటు పడి డబ్బులు పొగొట్టుకొని అప్పులు చేసేవారు. ఆ క్రమంలో తీసుకున్న అప్పులు తీర్చలేక యూట్యూబ్‌లో ఎలా చైన్ స్నాచింగ్ చేయాలనే దానిపై చూసి దొంగతనాలు చేయాలనుకున్నారు. ఇందుకు ఒంటరిగా ఉన్న మహిళలను ఎంచుకొని దొంగతనాలు చేయాలనుకున్నారు. ఈ క్రమంలోనే 2024, నవంబరు 9న పాతహౌసింగ్‌బోర్డులోని ఫాతిమా మసీదు సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తికెళ్లారు. ఈ దొంగతనాన్ని సీసీ ఫుటేజీలో పరిశీలించి వీరిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే శుక్రవారం వారు మళ్లీ దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా నల్లకుంట సమీపంలో పట్టుకొని విచారించారు. గతంలో చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నారు. దొంగిలించిన ఆ బంగారు గొలుసును కర్నూల్‌లో రూ. 1.20 లక్షలకు అమ్మినట్లు చెప్పారన్నారు. ఈ క్రమంలో నిందితులను ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారినుంచి రూ. 1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును పరామర్శించిన ఎమ్మెల్యే

కల్వకుర్తి/నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తండ్రి నారాయణరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి శనివారం హరీశ్‌రావు నివాసంలో నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుండూరు సురభి వెంకటేశ్వర్‌రావు, నాయకులు గోలి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(హెచ్143) నాయకుల పరామర్శ..

శనివారం టీయూడబ్ల్యూజే(హెచ్143) రాష్ట్ర నాయకులు హరీశ్‌రావును పరామర్శించి ఆయన తండ్రి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. హైదరాబాదులో మాజీ మంత్రి నివాసంలో టీయూడబ్ల్యూజే (హెచ్143) రాష్ట్ర సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(హెచ్143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లాఖాన్ తదతరులు హరీశ్‌రావు కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.


నివాళులర్పిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

ఐరన్ రాడ్ల మధ్య ఇరుక్కున్న బాలుడి తల

గండీడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఎన్ హెచ్ 167 రోడ్డు నిర్మాణంలో భాగంగా రక్షణగా వేసిన ఐరన్ రేలింగ్‌లో బాలుడి తల ఇరుకున్న ఘటన గండీడ్ మండలం జానంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం... శనివారం వెన్నచేడుకు చెందిన చల్లా నర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి బస్సు కోసం జానంపల్లి రోడ్డుపై వేచి ఉన్నాడు. అక్కడే ఆడుకుంటున్న అత ని కొడుకు శ్రీవర్ధన్ (4) రోడ్డు పక్కన వేసిన రేలింగ్ కొరకు ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లమధ్య తల ఇరుకుంది. గమనించిన తల్లిదండ్రులు, స్థానికు లు పలు విధాలుగా ప్రయత్నించినా లాభం లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు నజీర్, ఆనంద్ ఆ రాడ్లను వంచి బాలుడిని బయటకుతీసి కాపాడారు.

చెకుముకి సైన్స్ సంబురాలను విజయవంతం చేయాలి


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో చెకుముకి సైన్స్ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాకింగ్ వండర్స్ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి డిసెంబరు 14 వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో పోస్టర్‌ను వాకింగ్ వండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. చెకుముకి సైన్స్ సంబురాల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్, గణితం, సోషల్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలపై పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామని తెలిపారు. వాకింగ్ వండర్స్ గౌరవ అధ్యక్షుడు పాలమూరు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు పరశురాములు, నరేందర్‌రెడ్డి, జేపీ చారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- టైర్ల కింద నుజ్జునుజ్జయిన రెండు కాళ్లు


బాలుడు రామకృష్ణ

హన్వాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చి విద్యార్థిని బస్సు ఢీకొట్టడంతో రెండు కాళ్లు పూర్తిగా విరిగి నుజ్జునుజ్జయిన సంఘటన చిన్నదర్పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం 8.05 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్న దర్పల్లి గ్రామనికి చెందిన కారుకొండ సూజత, ఆంజనేయులు దంపతుల ముగ్గురు కొడుకులు గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. అయితే చిన్న కొడుకు రామకృష్ణను తల్లి పాఠశాలకు తీసుకెళ్లేందుకు తాండూరు- మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డు దాటుతుండగా, మహబూబ్‌నగర్ నుంచి పరిగి వెళుతున్న పరిగి బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. విద్యార్థి ముందు టైర్ల కింద పడడంతో రెండు కాళ్లు నుజ్జు నుజ్జయ్యాయి. తలకు తీవ్ర గాయం అయ్యింది. 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మహబూబ్‌బాషా జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలుడు ఒకటవ తరగతి చదువుతున్నాడు.

అయితే కుడి కాలు పూర్తిగా పనికిరాదని, ఆ కాలును తీసివేయాలని, ఎడమ కాలుకు ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. ఇక్కడ అందుకు కావలసిన పెసిలిటి లేదని, హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని జిల్లా వైద్యులు సూచించారు. దీంతో హైదరాబాద్ తరలించినట్లు బాలుడి బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు

గద్వాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారును ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో కారు వెనుకభాగం పూర్తిగా దెబ్బతిన్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని అయిజ రోడ్‌లో రాయిచూర్ రైల్వేలైన్ ట్రాక్ దగ్గర అయిజ నుంచి గద్వాలకు వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారు భాగాలు డ్యామేజ్ అయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.. కాని కారు పార్ట్స్ దెబ్బతినడంతో ఓనర్‌కు, ఆర్టీసీ డ్రైవర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని, ఆర్టీసీ డీపో అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు.


పూర్తిగా దెబ్బతిన్న కారు వెనుకభాగం

గుప్త నిధుల కోసం మరోసారి...!

- చర్యలు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు

మానవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండల కేంద్రం నుంచి చెన్నిపాడుకు వెళ్లే దారిలోని ఆంజనేయస్వామి గుడి ప్రాంగణంలో దుండగులు గుప్త నిధులకోసం శుక్రవారం రాత్రి సమయంలో పనిముట్లతో దోగిన ఆనవాళ్లు ఉన్నాయి. గతంలో ఎన్నోమార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. దోగిన ప్రతీసారి ఒకవైపు గుంతలు తీస్తున్నారు. గర్భగుడి మొదలుకొని అన్ని దిశలు దోగారు. చివరికి ఆలయానికి తూర్పు దిశకు సైతం గుంతలు తీశారు. గుంతలను చూసిన ప్రతీసారి కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు గుప్త నిధుల వేటలో ఉన్నట్లు తెలుస్తున్నది. గుంతలు తీసిన ప్రతీసారి హడావిడి చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు లేకపోవడంతోనే ఇందుకు కారణంగా తెలుస్తుంది. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్థులు గుంతలను పూడ్చివేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

నవాబ్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాయాదులు ఇంటిస్థలం ఆక్రమించగా అడిగినందుకు మహిళపై దాడిచేసి గాయపర్చడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన గంగేరి సాయమ్మ ఇల్లు లేకపోవడంతో గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో కిరాయికి ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆమె దాయాదులైన గంగేరి కురుమయ్య ఇంటిస్థలం కొంత ఆక్రమించడంతో ఎందుకు జరిగావని ఈనెల 23న సాయమ్మ ఆమె కూతురు రాములమ్మలు కురుమయ్యను నిలదీశారు. భార్య శివమ్మ, తల్లి చంద్రకళ, చిన్న బాలయ్య నానా బూతులు తిడుతూ ఇనుప కడ్డీలు, ఇటుకలతో దాడి చేసి గాయపర్చారు. దీంతో సాయమ్మ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గేదెల మృతి


మృతి చెందిన గేదెలు

నవాబ్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద కట్టేసి ఉన్న గేదెలు అనుమానాస్పద స్థితిలో మరణించాయంటూ ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం శనివారం తెలిపారు. జడ్చర్ల మండలం ఉదండాపూర్‌కు చెందిన భాస్కర్ గౌడ్ కొంత కాలం క్రితం నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల శివారులో రెండు ఎకరాల పొలం కొనుగోలు చేసి అందులో 13 గేదెలను పెంచుతూ పాలు పిండుకుని జీవనం సాగిస్తున్నాడు. గత నెల 31న రాత్రి వరకు అక్కడే ఉండి నవాబ్‌పేటకు వచ్చాడు. తెల్లవారు జామున వెళ్లిచూడగా నాలుగు బర్రెలు చనిపోయి మరో 3 బర్రెలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి.

ఇది గమనించిన భాస్కర్ పక్క రైతులకు చూపించాడు. అయితే పక్కపొలం రైతు కిస్తారం నర్సింహులు తన బకెట్‌లతో ఆయన పంటపొలానికి నీరు తీసుకుపోయాడని, అలాగే ఘటన స్థలంలో పురుగుల మందు డబ్బాలు పడిఉన్నాయని, తనకు రూ 2 లక్షల నష్టం జరిగిందని న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటిస్థలం వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పోలీసులకు ఫిర్యాదు

మహమ్మదాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని నవజీవన క్రియేషన్ భవన స్థలం విషయంలో గత కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ స్థల దాతలనుంచి అప్పట్లో గ్రామానికి చెందిన గొల్ల సువర్ణ, గొల్ల శ్రీశైలం, శ్రీనివాసులు కొనుగోలు చేశారు. తమ వద్ద అన్ని కాగితాలు ఉన్నాయని, కొన్నవారు చెబుతుండగా, ఈ స్థలం గ్రామకంఠం స్థలం అని ఇక్కడ క్లబ్ భవనం ఉందంటూ వివాదం సాగుతోంది. శనివారం అక్కడ ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ చేసేందుకు వెళ్లారు. ఈ స్థలంలో నవజీవన క్రియేషన్ భవనం కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్నదని, దాన్ని కూల్చి ఇల్లు కడుతున్నారని గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్, గ్రామస్థులు కలిసి అక్కడికి వెళ్లారు. దీంతో గొడవ చోటుచేసుకున్నది.

మాజీ సర్పంచ్‌పై అక్కడి వారు చేయి చేసుకున్నారని, గ్రామస్థులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం కోసం పూజ చేస్తున్న గొల్లసువర్ణ, గొల్ల శ్రీశైలం, శ్రీనివాసులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భూమిపూజ పనులను అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

చిలుకల వాగులో పడి వ్యక్తి మృతి


శంకరయ్య (ఫైల్)

ఉప్పునుంతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన కటికె శంకరయ్య (45) శనివారం ఉదయం చిలుకలవాగులో ప్రమాదవశాత్తు బైకుపై నుంచి వరద ప్రవాహంలో పడి వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల ప్రకారం.. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చిలుకల వాగుపై వరద ప్రవహిస్తున్నది. గ్రామానికి చెందిన శంకరయ్య దాసర్లపల్లి నుంచి బైకుపై మామిళ్లపల్లి గ్రామానికి పని పై వస్తుండగా చిలుకల వాగు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య కవితతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అచ్చంపేట ఆసుపత్రికి పోలీసులు తరలించినట్లు తెలిపారు.

పోలీసులకు తలనొప్పిగా మిస్సింగ్ కేసు

- కృష్ణానదిలో దూకి చనిపోతున్నట్లు వీడియో కాల్
- బీచుపల్లి వద్ద ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్ లభ్యం
- రెండు రోజులుగా దొరకని ఆచూకీ


మిస్సింగ్ అయిన ఎద్దుల వెంకటేష్ (ఫైల్)

వనపర్తి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఓ మిస్సింగ్ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. వనపర్తి మండలం కాశీంనగర్ ఎద్దులగేరి గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటేష్ (30) మేస్త్రీ పని చేస్తూ జీవనానికి కొనసాగిస్తున్నాడు. అక్టోబరు 30న మేస్త్రీ పనికి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం తన తమ్ముడు చంద్రాయుడికి వీడియో కాల్ చేసి "నేను బీచుపల్లి దగ్గర ఉన్నాను.. ఇక్కడ ప్రవహిస్తున్న కృష్ణానదిలో దూకి చనిపోతున్నాను" అని అక్కడే ఉన్న వీడియోను షేర్ చేశాడు. కుటుంబ సభ్యులు అందరూ హుటాహుటిన అక్కడికి వెళ్లారు. అక్కడ ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కానీ బీచుపల్లి బ్రిడ్జి దగ్గర ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్ ఉండడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో చంద్రాయుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డి తన పోలీస్ సిబ్బందితో కలిసి గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇటిక్యాల ఎస్‌ఐ, ఎస్‌బీఐ బృందం చొరవతో బోటు తీసుకుని రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. ఒక వేళ నిజంగా దూకి ఉంటే ఎక్కడో ఒక చోట మృతదేహం లభ్యమయ్యేది. అసలు దూకాడా లేదా అనే అనుమానాలు పోలీసులు అనుమానం ఉందని పేర్కొన్నారు. మరోపక్క దూకనట్లయితే ఎటు వెళ్లింటాడు అని మరోపక్క దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అదృశ్యం


తాండ్ర వెంకటయ్య (ఫైల్)

చారకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చారకొండ మండలంలోని ఆగ్రహారంతండాకు చెందిన వస్కూల ధనమ్మ తండ్రి తాండ్ర పెంటయ్య గత నెల 29న రాత్రి మతిస్థిమితం లేకపోవడంతో ఇంటినుంచి వెళ్లినట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... వెల్దండ మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన తాండ్ర పెంటయ్యకు మతిస్థిమితం లేకపోవడంతో తన కూతురు ధనమ్మ దగ్గరే ఉంటున్నాడు. గత నెల 29న రాత్రి భోజనం చేసి ఇంటి బయట పందిరి కింద నిద్రపోయాడు. తెల్లవారు జామున ఆమె లేచి చూడగా తన తండ్రి కనిపించ కపోవడంతో భర్త ప్రభాకర్‌తో కలిసి గ్రామంలో ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చినా తన తండ్రి ఆచూకీ లభించకపోవ డంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళపై దాడికి యత్నం

నవాబ్‌పేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో రాజీ కావాలని మహిళను ఓ వ్యక్తి బెదిరించి.. దాడికి ప్రయత్నించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఓ వ్యక్తి చొరబడి కేసు రాజీ కావాలని ఆమెను బెదిరించాడు. దీంతో ఆమె అరుపులు విన్న భర్త రావడం చూసి ఆ వ్యక్తి పరిగెత్తాడు. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని పోమాల గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ అదే గ్రామానికి చెందిన వివాహితను గతంలో వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు అయింది. ఇది మనసులో పెట్టుకున్న రమేష్ ఈ నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి సదరు వివాహితను కేసు రాజీ కుదుర్చుకుంటావా లేదా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె కేకలు వేయగా భర్త ఇంట్లోకి వచ్చేలోగా రమేష్ పారిపోయాడు. మరుసటి రోజు రమేష్ ఆయన బంధువులు మరోసారి వివాహితపై దాడికి యత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

కొండారెడ్డిపల్లి చెరువులో
యువకుడి మృతదేహం లభ్యం

నారాయణపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట కొండారెడ్డిపల్లి చెరువులో శనివారం స్థానిక పళ్ల ప్రాంతానికి చెందిన యువకుడు గడ్డం శివరాజ్(25) మృతదేహం శనివారం సాయంత్రం లభ్యమైంది. పెద్దఎత్తున ఆ ప్రాంత వాసులు చెరువు దగ్గరికి వెళ్లి పరిశీలించారు. కుటుంబీకుల రోదనలు కలచివేశాయి. కార్పెంటర్ వృత్తి చేస్తున్న గడ్డం శివరాజ్ గురువారం రాత్రి నుంచి కనిపించకుండా పోవడంతో పోలీసులకు తల్లి సత్యమ్మ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువకుడి నెంబరుకు ఫోన్ చేయగా, ఫోన్ చెరువు దగ్గర పడి ఉందని చెప్పడంతో కుటుంబీకులు, యువకులు అక్కడికి చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి చెరువు దగ్గర యువకుడి బైక్‌తో పాటు సెల్‌ఫోన్‌ను స్వా.ధీనం చేసుకొని పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో పరిశీలించ గా శనివారం మృతదేహం లభ్యమైంది. యువకుడు తానే చెరువులో దూకి ఆ త్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఎవరైనా తోసివేశారా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రహదారి బురదమయం


డైవర్షన్ రోడ్డుపై పేరుకుపోయిన బురద

అమ్రాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండల కేంద్రంలో గత నాలుగు నెలల క్రితం రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి మార్కెట్ యార్డు నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం మీదుగా కొత్త బస్టాండ్ వద్దకు డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డు ఏర్పాటు చేసినప్పటి నుంచి విపరీతమైన వర్షాలు కురుస్తుండటంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ఉన్న బురదలో ప్రయాణించాలంటేనే వాహన చోదకులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారు జారిపడి బురదలోనే పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ డైవర్షన్ రోడ్డుపై కంకర వేసి రోలర్‌తో తిప్పినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు తక్షణమే చొరవ తీసుకుని మరమ్మతులు చేయించాలని మండల కేంద్రానికి చెందిన పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

● బురదను తొలగించి మరమ్మతులు చేయిస్తాం

విస్తరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుపై ప్రజలు పడుతున్న ఇబ్బందులు పడుతున్నది వాస్తవం. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ రోడ్డుపై ఉన్న బురదను తొలగించి మరమ్మతులు చేయిస్తాం.

- రుక్మాంగద అమ్రాబాద్ ఆర్‌ఏఈ

భౌ.. భౌతో బెంబేలు!

- గద్వాల పుర వీధుల్లో కుక్కల పరుగులు
- 5 నెలల వ్యవధిలో 720 మంది కుక్కకాటు బాధితులు
- స్వైర విహారాన్ని నియంత్రించడంలో అధికారుల అలసత్వం


గద్వాలలోని నల్లకుంట-ఈదమ్మగుడి మార్గంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

గద్వాల సర్కిల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల పుర పరిధిలోని పలు వీధుల్లో కుక్కలు ఎక్కడ పడితే అక్కడ పరుగులు పెడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. భౌ.. భౌమంటూ బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ కనపడిన వారిపై దాడులకు దిగుతున్నాయి. అడ్డుకోబోయే వారిపై తెగబడి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. చిన్నా..పెద్దా అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా స్వైరవిహారం చేస్తూ దాడులకు తెగబడుతున్నాయి. గద్వాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందిన గణాంకాల మేరకు కేవలం గత 5 నెలల వ్యవధిలో 720 మంది కుక్కల దాడిలో గాయపడ్డారంటే గద్వాల పుర పరిధిలో వాటి తాకిడి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా గద్వాల పుర అధికారులు తమకేమి పట్టనట్టు నిర్లక్ష తీరును వ్యవహరించడం పట్ల గద్వాల ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గద్వాలలోని భీంనగర్, రెవెన్యూ కాలనీ, హమాలీ కాలనీ, చింతలపేట, గంటవీధి, గంజిపేట, సుంకులమ్మమెట్టు, ఈదమ్మగుడి (అయిజ రహదారి), పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, దౌదరపల్లి, నల్లకుంట, రాంనగర్, ఒంటెలపేట, వడ్లవీధి, వీవర్స్‌కాలనీ, రెండవ రైల్వే గేట్, జమ్మిచేడు, జిల్లా ఆస్పత్రి మార్గం, పిలిగుండ్ల తదితర కాలనీల్లో శునకాల స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిని సుదూర ప్రాంతాలకు తరలించి ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గద్వాల పరిధిలో చోటు చేసుకున్న వివరాలు కొన్ని..

● గద్వాల పరిధిలోని రెవెన్యూ కాలనీ ముగ్గురు 7వ తరగతి విద్యార్థులు పాఠశాల ఇంటర్‌వెల్ సమయంలో మూత్ర విసర్జనకు వెళ్తుండగా ఐదారు కుక్కలు మీదకు ఎగబాకడంతో ఇద్దరు విద్యార్థులు పరుగులు తీయగా, భయంతో కిందపడిన ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపరిచాయి.

● హమాలీ కాలనీకి చెందిన ఏడాదిన్నర చిన్నారి, 6 ఏళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారి కుక్కల గుంపు దాడికి పాల్పడింది. ఈ ఘటనలో చిన్నారి ముక్కు, తల, మెడ ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కాగా, బాలుడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

● మద్రాస్‌పేటకు చెందిన ఓ విద్యార్థి ఇంటి సమీపంలోని దుకాణం వద్దకు వెళ్తుండగా ఓ పిచ్చి కుక్క ఆ చిన్నారిని గాయపర్చింది. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

● నల్లకుంట, రాజీవ్‌మార్గ్, ఈదమ్మగుడి (గద్వాల టౌన్ పోలీసు స్టేషన్ మార్గం), సెకండ్ రైల్వే గేట్, గద్వాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్గంలో తెల్లవారు జామున, రాత్రి సమయాల్లో పాదచారులు, వాహనదారులపై శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు చాలా చోట చేసుకుంటున్నాయి.

చిన్నారులకు చాలా ఇబ్బందికరం..

గద్వాలలోని భీంనగర్‌లో ఆడుకుంటున్న చిన్నారులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు శునకాల స్వైర విహారం ఇబ్బందికరంగా మారింది. గద్వాల మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకుని చిన్నారులు, విద్యార్థులను కుక్కల గుంపు బెడద నుంచి కాపాడాలి.

- శివకుమార్, భీంనగర్ గద్వాల

సుప్రీంకోర్టు ఆదేశానుసారం చర్యలు చేపడుతున్నాం..

కుక్కల బెడదపై సుప్రీం కోర్టు ఆదేశానుసారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గద్వాలలో సంచరిస్తున్న కుక్కలపై సర్వే చేస్తున్నాం. ఇప్పటి వరకు 700 ఆడ, పిచ్చి కుక్కలు గుర్తించాం. కుక్కలు స్వైర విహారం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.

- జానకీరాం సాగర్, గద్వాల పుర కమిషనర్



మెరుగైన వైద్యం అందించాలి



గద్వాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు

- అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యేలు, నాయకులు

గద్వాల న్యూటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రాత్రి ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరం బీసీ ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శనివారం విద్యార్థులను పరామర్శించారు. వారికి ధైర్యాన్ని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరతో విద్యార్థుల ఆరోగ్య విషయాలను తెలుసుకొని వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.... ప్రభుత్వ వసతి గృహంలోని విద్యార్థులు 52 మంది అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. రాత్రి వైద్యులు వెంటనే స్పందించి ఆ విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని లేకుండా వైద్యం అందించారన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి సంఘటనకు గల కారణాలను తెలుసుకొని, వాటిని పరిష్కరించి భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు పరామర్శలు

ఫుడ్‌పాయిజన్ అయిన సంఘటనలో శనివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య విషయంపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించి వారు త్వరగా కోలుకునేలా చూడాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండ్ ఇందిరకు సూచించారు. అనంతరం చికిత్స పొందుతున్న ఒక్కొక్క విద్యార్థి దగ్గరకు వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగ రావు, బీఆర్ఎస్ నాయకుడు గోపాల్ తదితరులు ఉన్నారు. అలాగే, విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థుల ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. ఇందుకు కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వసతిగృహ విద్యార్థులను బీజేపీ నాయకురాలు డి.కె.స్నిగ్ధారెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య విషయంపై వైద్యులతో ఆరాతీసి వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని ఆసుపత్రి వర్గాలను కోరారు. ఆమె వెంట బీజేపీ నాయకులు రామాంజనేయులు, మీర్జాపురంవెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయి, సతీష్, రాజు తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం


విద్యార్థులను పరామర్శిస్తున్న డి.కె.స్నిగ్ధారెడ్డి

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు బాలికను హాజరుపర్చిన డీసీపీయూ సభ్యులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చెన్నపురావుపల్లి గ్రామంలో బాల్య వివాహం చేస్తుండగా అధికారులు అడ్డుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. 18సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. దీంతో నాగర్‌కర్నూల్ చైల్డ్ హెల్ప్‌లైన్, డీసీపీయూ యూనిట్ సభ్యులు, స్థానిక పోలీసులు సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా చెన్నపురావుపల్లి గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తితో 9వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను ఇచ్చి బలవంతంగా పెళ్లి చేయాలని ప్రయత్నించారు. ఆ బాలికను జిల్లా బాలల సంరక్షణ సమితికి సమాచారమందించడంతో అదుపులోకి తీసుకుని పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి అమ్మాయిని తరలించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు హాజరుపర్చారు. అమ్మాయికి వారి సోదరునికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం అమ్మాయిని బాలసదన్‌కు తరలించారు. డీసీపీయూ యూనిట్ ప్రతినిధులు జంగిటి మధుబాబు, లలిత, చైల్డ్‌హెల్ప్‌లైన్ ప్రమీల, స్థానిక అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నిండా ముంచిన నకిలీ విత్తనాలు

- మోసపోయిన రైతు
- లక్షల్లో అప్పులు చేసి పెట్టుబడి పెట్టినా దిగుబడి రాకపోయె..
- న్యాయం చేయాలంటున్న రైతు


మారేపల్లిలో ఏపుగా పెరిగిన వరి పంటలో కన్పించని ధాన్యం

తిమ్మాజిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన దోమ వెంకటయ్య అనే రైతు లక్షల్లో అప్పులు చేసి 25ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తి విత్తనాలు నాటాడు. ఏపుగా పెరిగినా పూత పూయలేదు, కాత కాయలేదు.. దిగుబడి రాలేదు. నట్టేట ముంచిన నకిలీ విత్తనాలతో రైతు లబోదిబోమంటున్నాడు. పురుగుల మందులు, విత్తనాలు అమ్మే దుకాణమే తనకు శాపంగా మారిందని అంటున్నాడు. మరికల్‌లో మహేష్ విత్తనాలు, పురుగుల మందులు అమ్మే అదే దుకాణంలో వరి ధాన్యపు సంచులు కొనుగోలు చేసి సాగు చేసినా ఫలితం లేకుండాపోయింది. మిర్చి పంట వేసిన రైతుకు మిగిలింది శూన్యం. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతు దోమ వెంకటయ్య శనివారం 'ఆంధ్రజ్యోతి'తో తన ఆవేదనను వ్యక్తం చేశారు. దుకాణపు యజమాని మహేష్‌గౌడ్ తనను నమ్మించి మోసం చేశాడని ఆరోపించారు. పత్తి విత్తనాలు, మిర్చి హైబ్రిడ్ విత్తనాలు, వరి సంచులు కొనుగోలు చేసి పంట వేశానని, దాదాపు పది లక్షల మేరకు అప్పులు చేశానన్నారు. మిర్చి, పత్తి, వరి పంటల ద్వారా దిగుబడి రాకపోవడంతో దిగులు చెందుతూ దుకాణ యజమాని ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేసినా కన్పించడం లేదని ఫోన్ ద్వారా మాట్లాడినా ఫలితం లేదన్నారు. దిక్కుతోచని స్థితిలో వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి అధికారికి న్యాయం జరిగేలా చూడాలని విన్నవించానన్నారు. మరో రైతుకు అన్యాయం జరగకుండా నకిలీ విత్తనాలు అమ్మే దుకాణాన్ని సీజ్ చేసి నష్ట పరిహారాన్ని ఇప్పించాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పంటను పరిశీలించిన అధికారి..

మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ మారేపల్లి గ్రామానికి చెందిన దోమ వెంకటయ్య అనే రైతు చేసిన పంటను శనివారం పరిశీలించారు.

రైతుకు న్యాయం జరి గేలా విచారణ చేపడతామన్నారు. దుకాణ పు యజమానిపై పలు పర్యాయాలు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. త్వరలో దుకాణాన్ని సీజ్ చేసి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

గురుకుల ఘటనపై మెమో జారీ

- కలెక్టర్ బీఎం సంతోష్


వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలం వీరాపురం సమీపంలోని సామాజిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి థామస్‌పై ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటనపై జిల్లా అధికారులు తీవ్రంగా స్పందించారని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు.

ఈ ఘటనకు సంబంధించిన ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత శాఖాధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయుడి నుంచి వివరణ కోరతూ మెమో జారీ చేసినట్లు తెలిపారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అరవింద్‌కుమార్


ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అరవింద్‌కుమార్‌తో ఆలయ కమిటీ సభ్యులు

తిమ్మాజిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్)అరవింద్‌కుమార్ శనివారం తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహాలక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేద పండితులు గంగాధర శర్మ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావళి పఠించి గోత్రనామాలు చదివి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. పరిసరాలను పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యేలా చూస్తానన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన హైదరాబాద్‌కు చెందిన భార్గవ గురుస్వామి కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారావు, కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, పలువురు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఇంటర్వ్యూ..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- చంద్రశేఖర్, ఎంపీడీవో, లింగాల



లింగాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి?

మండలంలో ఆయా గ్రామాల్లో మొదటి విడతలో మొత్తం 426 ఇళ్లు మంజూర య్యాయి. ఇందులో 80 ఇళ్లు గిరిజన చెంచులకు మంజూరయ్యాయి.

మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి?

ఇప్పటి వరకు బేస్‌మెట్ లెవల్‌లో 212 ఇళ్లు పూర్తికాగా లెంటల్ లెవల్ 38ఇళ్లు స్లాబ్ లెవల్ 14 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నారా?

బేస్‌లెవల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు లక్ష రూపాయలు, లెంటల్ లెవల్‌కు రెండు లక్షలు, స్లాబ్ లెవల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు 4లక్షల వరకు బిల్లులు చెల్లించాం.

మిగతా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు మొగ్గు చూపడం లేదా ?

మొదటి దశలో మంజూరైన అన్ని ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునే దశగా అవగాహన కల్పిస్తున్నాం.

గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎలా ఉన్నాయి, వీధి దీపాలు వేయిస్తున్నారా?

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. మురుగు కాల్వలను కూడా శుభ్రం చేస్తున్నాం. నిధుల లేమితో కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు లేని మాట వాస్తవమే. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం.

న్యూస్ బాక్స్

రోడ్లకు మరమ్మతు చేయాలి

- మునిసిపల్ కమిషనర్‌కు వినతి

కందనూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లోని ఎంబీ చర్చి మహిళా కమిటీ సభ్యులు శనివారం మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 5న చర్చిలో జరగనున్న మహిళా కూడికకు 500మంది క్రైస్తవులు రానున్నందున చర్చి పరిసరాలు పరిశుభ్రం చేయాలని, నల్లవెల్లిరోడ్డుకు, మరమ్మతులు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.

'ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

అచ్చంపేటటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామంలో సూమారు 50మంది ఓట్లు అక్రమంగా తొలగించారని పలువురు గ్రామస్తులు శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు సాయిబాబు, రవీందర్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఓటర్లను అకారణంగా రాజకీయ నాయకులు, అధికారులు తొలగించారని తెలిపారు. తక్షణమే కలెక్టర్, అధికారులు పరిశీలించి తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

అచ్చంపేటరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామంలో శనివారం బీజేపీ బూత్ నెంబరు 144 అధ్యక్షుడిగా బత్తుల గణేష్ యాదవ్ ఎన్నికయ్యారు. గణేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ అఖిల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కాశీగౌడ్, బీజేపీ నాయకులు కాశీముదిరాజ్, శ్రీకాంత్, నరేష్, విష్ణు, సోనమోని నరేష్, అజయ్, సౌదులు, పవన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

మన్ననూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నల్లమల లోతట్టు ప్రాంతంలోని అప్పాపూర్, భౌరాపూర్, మేడిమాల్కల, ఈర్లపెంట, ఆగర్లపెంట, రాంపూర్‌పెంటల్లో పీఎం జన్‌మన్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని చెంచులు కోరుతున్నారు. వారంలోరెండు పర్యాయాలు మారుమూల పెంటల్లో పీఎం జన్‌మన్ వైద్య బృందం సంచార వైద్య శిబిరాలు నిర్వహించాలనే నిబంధనలు ఉన్నా, కేవలం మల్లాపూర్, కొమ్మన పెంటలకు మాత్రమే వైద్య శిబిరాలను పరిమితం చేశారన్నారు. ప్రస్తుతం నల్లమలలో వర్షాలు కురవడంతో చెంచులు సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

- జిల్లా పశువైద్యాధికారి జ్ఞానశేఖర్

బల్మూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పశు సంపదను కాపాడుకునేందుకు ప్రతీ ఒక రైతు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞానశేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంనగర్ కాలనీ, సీతారాంపురం, తోడలగడ్డ గ్రామాల్లో పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ అనిల్ తెలిపారు. 452 పశువులకు టీకాలు అందించినట్లు వారు తెలిపారు. డాక్టర్ మహేశ్వరి, పారా మెడికల్ వెటర్నరీ సిబ్బంది గోపాల్, ఆయా గ్రామాల పశువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవుల వెతలు

- సాంఘిక సంక్షేమ వసతి గృహాల అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అందని వేతనాలు

- 8 నెలలుగా కుటుంబ పోషణ భారం

కల్వకుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు రాక అవస్థలుపడుతున్నారు. విద్యార్థులకు భోజనాలు వండి పెడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి 8 నెలలుగా వేతనాలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో దిన దినగండంగా కాలం వెళ్లదీస్తున్నారు.

జిల్లా పరిధిలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 29 ప్రీమెట్రిక్ హాస్టళ్లు, ఆరు పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వసతి గృహాల్లో కుక్, వాచ్‌మన్, కామాటి సిబ్బంది 78మంది ఉండగా అందులో రెగ్యులర్ సిబ్బంది 35 మంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది 43 మంది పని చేస్తున్నారు.

నెల నెలా జీతాలు రాక..

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వం ప్రతీ నెల రూ.21,567 వేతనం ఇస్తున్నది. అందులో ఈపీఎఫ్ 25శాతం, ఈఎస్ఐ 4శాతం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కమీషన్ 4శాతం, జీఎస్టీకి 18శాతం కటింగ్ అవుతుంది. అన్నీపోను వీరికి నెలకు రూ.13,460లు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుంది. కానీ, 8 నెలలుగా వేత నాలు



కూరగాయలు కోస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

రాకపోవడంతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లోని వేతనాలు విడుదల చేయాలని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

జూలై వరకు ఇచ్చేందుకు చర్యలు

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఏప్రిల్ నుంచి జూలై నెల వరకు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ఉమాపతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి



నడింపల్లిలో పంటలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా నాయకులు



మర్లపాడుతండాలో తడిసిన పత్తిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- పంటలను పరిశీలించిన బీజేపీ, సీపీఎం నాయకులు

అచ్చంపేట/ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటల వివరాలు అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొక్తల రేణయ్య ఆరోపించారు. శనివారం అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామంలో తుఫాన్‌కు గురైన పంట పొలాలను నాయకులు పరిశీలించారు. బీజేపీ రూరల్ మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తుఫాన్ వచ్చి మూడు రోజులైనా అధికారులు ఇప్పటికీ పంటలు, చనిపోయిన జంతువుల నష్టాన్ని అంచనా వేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అఖిల్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకుడు బాలకృష్ణయాదవ్, మండల ఉపాధ్యక్షుడు కాశీగౌడ్, నాయకులు దేవేందర్ రెడ్డి, సతీష్, కాశీ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, పవన్ హాజరయ్యారు.

దేవుని తిర్మలాపూర్‌లో..

పెద్దకొత్తపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్‌లో మొంథా తుఫాన్ కారణంగా వరి పైరు నేలకూలి భారీగా నష్టం జరిగింది. బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో శనివారం ఆ గ్రామ శివారులో వ్యవసాయ పొలాలను పరిశీలించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల శివుడు, జిల్లా బాధ్యులు పదిర బీమేష్, జిల్లా కార్యదర్శి తిరుమల్‌యాదవ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ తుఫాన్ తర్వాత మూడు రోజులు గడిచినా ఇప్పటికీ అధికారులు పంటలు, ఇతర జంతువుల నష్టాన్ని అంచనా వేయడంలో విఫలమయ్యారని వారు ఆరోపించారు. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ప్రధానమంత్రిఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబరు మేకల శివ, ప్రధాన కార్యదర్శి పిల్లి నాగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సుధాకర్‌రావు, మద్దిలేటి, ఇంద్రకంటి శేఖర్, పగడాల బాలకృష్ణ, సారాయి శేఖర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మార్కండేయ, సిద్ధార్థ్, కృపేందర్, రాముడు, రాజశేఖర్, రైతులు అనమోని కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెల్టూరు రోడ్డుకు మరమ్మతు చేయాలి

ఉప్పునుంతల, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కోతకు గురైన వెల్టూరు రోడ్డును మర్మమతు చేయాలని ఆ గ్రామస్థులు బాలరాజు, మల్లయ్య, నాగరాజు, జంగయ్య కోరారు. ఈ రోడ్డు తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు.

మర్లపాడు తండా వాసులను ఆదుకోవాలి : సీపీఎం

అచ్చంపేట రూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపాడుతండా మొంథా తుఫాన్ ప్రభావంతో వరదల్లో చిక్కుకున్న గిరిజన కుటుంబాలు సహాయం కోసం ఎదురు చూస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్. దేశ్యానాయక్ తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ముంపునకు గురైన మర్లపాడుతండాను శనివారం పరిశీలించి, గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తుఫాను ధాటికి తండా ముంపునకు గురవడంతో గిరిజనలు కట్టుబట్టలతో బయట పడ్డారని తెలిపారు. కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి, ఆర్థిక సాయం అందించి, గిరిజనులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం, సరుకులు వెంటనే ఇవ్వాలని కోరారు.

విద్యార్థులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ విమర్శించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో సినీ కార్మికుల కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందిస్తామని హామీలు గుప్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ తక్షణమే ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, దేవదాస్, భరత్, నాగరాజు, సిద్దు, సురేందర్, విజయ్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు ఎల్లికట్టలో వైద్య శిబిరం

కల్వకుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామంలో ఆదివారం వన్ మేడి హబ్, ఐక్యత ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శిబిరం ఉదయం 7:30గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కోరారు.

నూతన జూనియర్ కళాశాల భవనం నిర్మించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎఫ్ నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మూడు నెలల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేపడతామని హామీ నేటికీ ఆచరణలో పెట్టలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కళాశాలకు నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు అభిషేక్, గణేష్, రాజు, రాము పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు మాదిగ

కల్వకుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆకలినైనా భరిస్తాం కానీ అవమానం సహించబోమని ఆయన హెచ్చరించారు. ఎమ్మార్పీఎస వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ ర్యాలీ ప్రదర్శనకు నియో జకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తునతరలి వెళ్లారు. కల్వకుర్తిలో వాహన ర్యాలీని ఎమ్మార్పీఎస్ రాజు మాదిగ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయి మీద అడ్వకేట్ రాకేష్ కిశోర్ అను వ్యక్తి బూటుతో దాడి చేయడం రాజ్యాంగం మీద దాడి జరిగినట్టేనన్నారు. రాకేష్ కిశోర్‌పై తక్షణమే కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ధార రాధాకృష్ణమాదిగ, మంగళగిరి శ్రీను మాదిగ, బంగారయ్యమాదిగ, రమేష్ మాదిగ, పరమేశ్ మాదిగ, సిద్దులు మాదిగ, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు బయల్దేరే ముందు కల్వకుర్తిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూ సమస్యల పరిష్కారం కోసమే..

- రెవెన్యూ సదస్సుల్లో అధికారులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను చేపట్టిందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఆదిరాల, వేడుకరావుపల్లి గ్రామాల్లో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతులు ఇంతకు ముందు రెవెన్యూ సదస్సులో పెట్టుకున్న అర్జీలను ఇప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు పరిష్కరించారు. ఆదిరాలలో 12, వేడుకరావుపల్లిలో 19దరఖాస్తులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఆదిరాల గ్రామ సభలో తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ శివకృష్ణ, జీపీవో ఎండి.ఖాజాబాను, వేడుకరావుపల్లి గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, జీపీవో కృష్ణ పాల్గొన్నారు.

● కోడేరు, (ఆంధ్రజ్యోతి) : శనివారం మండల పరిధిలోని బావాయిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు కొంత కాలంగా భూములు రికార్డులు నమోదు కాని వారు వివిధ సమస్యలతో ఉన్న వారు రెవెన్యూ సదస్సులో భూమికి సంబంధించి రికార్డులు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్ఐ మహేష్, రైతులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గత రెవెన్యూ సదస్సులో అందజేసిన భూ సమస్యల సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్ రామకృష్ణయ్య పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, సీనియర్ అధికారి శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



వేడుకరావుపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్

రామాలయంలో కార్తీక ఏకాదశి పూజలు

కందనూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల సీతారామ చంద్రస్వామి దేవాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని కార్తిక శనివారం ఏకాదశి పరమశివునికి పూజలు, అభిషేకాలు, అర్చనలు, కార్తీక దీపారాధన, విష్ణుసహస్ర పారాయణ పఠనం నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యం గార్ తెలిపారు. ఈ కార్తిక మా సంలో ప్రతీరోజు విశిష్ట పూజలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మన్యపురెడ్డి, రమాదే వి, శారద, శ్రీనివాసులు, అర్థం రవీందర్, స్వా మి, కరుణశ్రీ, స్వామి, పాండు, పుల్లయ్య, సు జాత, రాజు, యాదమ్మ, చెన్నయ్య, విజయ్‌కు మార్, గొల్ల రాములు, భక్తులు మహిళలు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న స్వాములు

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

నాగర్‌కర్నూల్ టౌన్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అయ్యప్ప దేవాలయంలో మాలధారణ చేసిన ప్రతీ స్వామికి జనవరి వరకు నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పసుపుల సుందర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ అయ్యప్ప దేవాలయంలో పలువురు స్వాములు అయ్యప్ప మాలలు స్వీకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆలయ కమిటీ నుంచి అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలధారణ

చారకొండ, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయం, కనకదుర్గమాత దేవాలయంలో శనివారం గురుస్వాములు యాదయ్యగౌడ్, యాదగిరిచారి ఆధ్వర్యంలో 20 మంది అయ్యప్ప స్వామి మాలవేశారు. అనంతరం అయ్యప్ప స్వామి సన్నిదానం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఈసందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప మాలధరించిన స్వాములు 41 రోజులు భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్వాములు రంజిత్, చండీశ్వర్, కన్నా, శ్రీశైలం, మల్లేష్, రామకృష్ణ, వెంకట్‌నారి, కొండలయ్య, రమేష్, లోకేష్, శ్రీను, మనస్విని, లక్ష్మి, అన్విక పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి తమ వంతు పాత్ర పోషించాలి

- న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని

కొల్లాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :

ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో అవకాశం ఉన్నంత మేరకు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని న్యాయ సేవా అధికారసంఘం చైర్మన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని అన్నారు. కొల్లాపూర్ బార్ అసోసియేషన్, ప్రాసిక్యూషన్, పోలీసు, ఫారెస్టు, వివిధ బ్యాంకుల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ఈనెల 15వ తేదీ శనివారం రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ఎన్ఐ యాక్టు కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాల నేపథ్యంలో వేసిన కేసులు, బ్యాంకులు వేసిన బ్యాంకు రికవరీ కేసుల పరిష్కారం కోసం నిర్వహించబడే ప్రత్యేక లోక్ అదాలత్ గురించి వివరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ స్పెషల్ లోక్ అదాలత్‌ను వినియోగించుకొని పై తెలిపిన కేసుల పరిష్కారం కోసం తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశానికి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నిరంజన్, లోక్ అదాలత్ సభ్యులు కురుమూర్తి, మోహన్‌లాల్, న్యాయవాది మధుసూదన్‌రావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కొల్లాపూర్, కోడేరు, పెంట్లవెల్లి, ఎస్ఐలు హృషికేష్, జగదీశ్వర్, రామన్ గౌడ్, ఏఎస్ఐ పెద్దకొత్తపల్లి లక్ష్మయ్య, ఎక్సైజ్ ఎస్ఐ మురళి, ఎస్‌బీఐ బ్యాంకు అధికారి రామ్‌బాబు, కోర్టు సిబ్బంది శ్రీనివాసులు, శ్రీలత, షాకీర్ హుస్సేన్,

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎంహెచ్‌వో కే రవికుమార్

కందనూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కే.రవి కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పెద్దముద్దునూర్ పీహెచ్‌సీ పరిధిలోని వనపట్లలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వ్యాధి గ్రస్తులందరినీ పరీక్షించి పూర్తిగా చికిత్స అందించడం ద్వారా వ్యాధిని అంతం చేయగలమని ఆయన పేర్కొన్నారు. వనపట్ల గ్రామంలో 107 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిష్య భారత స్వచ్ఛంద సంస్థ డాక్టర్ పవన్‌కల్యాణ్, సీహెచ్‌వో శ్రీను, ఎంపీహెచ్‌ఈవో ఫసియోద్దీన్, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివా సులు, ఎక్స్‌రే టెక్నీషియన్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

మధ్యాహ్నా భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

కందనూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్నా భోజనం కార్మికు లకు ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, కనీస బీమా సౌకర్యం, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్నా భోజన కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో నాయకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నా భోజన కార్మికులకు సమస్యలను పరిష్కరించి కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్నా భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 12న రాష్ట్రవిద్యా శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామ ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిప త్రం అందించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి, ఏఐ టీయూసీ జిల్లా నాయకులు చిన్నపాక శ్రీనివా సులు, కుమార్, గోర్లసత్యం, సంఘం కృష్ణ, చంద్రయ్య, చిన్నయ్య, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

పెద్దకొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో అర్హులై న ఇల్లు లేని నిరుపేదలకు ఇంది రమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకు డు కృష్ణగౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని యాపట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి పరశురాముడు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జాంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జట్టి నరేష్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, పరమేశ్, బాలచందర్, చంద్రునాయక్, మురగోపాల్, కొండల్ లింగస్వామి, వెంకటేశ్, సుగురి కృష్ణయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కోడేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు ఎంఎల్‌పీహెచ్ శ్రీనివాసులు, కళాజాత కళాకారులు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని తుర్కదిన్నె గ్రామంలో కళాజాత బృందం పాటల ద్వారా సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, డీపీఆర్‌ఓ ఆదేశానుసారం ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ టి.సువర్ణ, శివలింగం, నరసింహ, శ్రీనివాసులు, డి.కృష్ణయ్య, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

సైనికులను అవమానించిన సీఎం క్షమాపణ చెప్పాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రంగౌడ్

కందనూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్‌లో జరిగిన ప్రచార సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశాన్ని అవమానపరిచే రీతిలో మా ట్లాడడం తగదని, తక్షణమే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కా ర్యదర్శి పంజుగుల నాగేంద్రంగౌడ్ డిమాండ్ చే శారు. శనివారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే భారత సైన్యానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్ కుమార్, శ్రీనివాసులు, జిల్లా ఆఫీస్ సెక్రటరీ శ్రీచందు, జగదీశ్వర్‌రెడ్డి, బాలరాజు, బాలమల్లయ్య, వెంకటేష్, దళిత మోర్చా నాయకులు ఏ.శ్రీనివాసులు, పెదబాబు, నాయకులు భీమేశ్వర్‌రెడ్డి, సైదులు ఉన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు